క్లుప్తంగా

విమాన ప్రమాదంపై కైలే దిగ్భ్రాంతి



మోపర్రు(పెదపారుపూడి):అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం సంఘటన పట్ల మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మోపర్రులో మాట్లాడుతూ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు దేశం బాసటగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బోయిన శివయ్య, ఆల రమేష్, జూపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో యోగ

గుడివాడ టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పుస్కరించుకుని భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ, ది గుడివాడ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా గురువు వడ్రె లీలావతి ఆధ్వర్యంలో యోగా శిక్షణ జరిగింది. సూర్యనమస్కారం ప్రాధాన్యతను, శ్వాస మీద ధ్యాస, అభ్యాసనం తదితర అంశాలను వివరించి యోగా చేయించారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్, గుడివాడ క్లబ్ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

కైకలూరు: గ్రామీణ స్థాయిలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద మండవల్లి మండలం భైరవపట్నం గ్రామ కమిటీ నియామకాలు శుక్రవారం పూర్తయ్యాయి. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కన్నెపాముల రమేష్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను అభినందించిన డీఎన్నార్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్నా సమస్యలపై ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో మండవల్లి మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసోబురాజు, గ్రామ నాయకులు వాసురాజు, పూర్ణ, ఆదినారాయణ, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా పుస్తకాలు పంపిణీ చేశారు. వడాలి జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్ ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఉపాధ్యాయులు, వీరమల్లు పరిశీలించి సన్న బియ్యంతోనే భోజనం వడ్డించాలని సూచించారు.

గుడ్లవల్లేరు: మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు వి క్యూబ్ ఫౌండేషన్ అధినేతలు పామర్తి వీర రాఘవులు, మోదుగుమూడి అంకాలరావు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఫౌండేషన్ మెంబర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాలకేంద్రం అధ్యక్షుడిగా రత్నప్రసాద్

పెదపారుపూడి:పాల కేంద్రం సొసైటీ అధ్యక్షుడిగా పుణుకొల్లు రత్నప్రసాద్(నాని)ని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ పాలకేంద్రంలో 4వ విడత ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు పేర్కొన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు డైరక్టర్‌గా బాధ్యతలు నిర్వహించటం జరుగుతుందన్నారు. పశుపోషకులకు గిట్టుబాటు ధర యాజమాన్యం అందించే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

రమణీయంగా శ్రీనివాసుని కల్యాణం



నిమ్మకూరు(పామర్రు):తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ దేవాలయం నిమ్మకూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శుక్రవారం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నరసింహాచార్యులు (స్వామి) ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. కార్యక్రమాలను రుత్విక్కుల వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ అధికారులు, స్థానిక పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో మురుగు పారేదెలా?

- పూడుకుపోతున్న పామర్రు డ్రెయిన్
- పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు



గుర్రపు డెక్కతో పేరుకుపోయిన పామర్రు మురుగు డ్రెయిన్

పామర్రు:మండల పరిషత్ కార్యాలయం నుంచి లంక కాలువ వరకూ సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న మురుగు డ్రెయిన్ పూడుకుపోతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పామర్రులోని 13 నుంచి 20 వార్డులలోని నివాసం ఉంటున్న ప్రజలు వాడుకున్న మురుగునీరు ఈ డ్రెయిన్ ద్వారా ప్రవహించి లంక కాలువలో కలవాలి. డ్రెయినేజీలో గుర్రపుడెక్క, జమ్మి తదితర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు దిగువకు ప్రవహించడం లేదు. దీంతో ఆయా వార్డుల్లోని మురుగునీరు అక్కడే నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ అంతా చెత్త చెదారంతో పూడి పోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. గతంలో తహసీల్దార్ ఈ విషయమై స్పందించి డ్రెయినేజీలోని మురుగుని తొలగించడమే కాకుండా గట్లపై ఉన్న ఆక్రమణలు సైతం తొలగించారు. ఆ తర్వాత కాలంలో మరలా డ్రెయినేజీపై ఆక్రమణలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేక పోవడంతో డ్రెయినేజీలో మురుగు, ఆక్రమణలు పెరిగిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకూ ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో డ్రెయినేజీలో మురుగు పేరుకుపోతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాల్వలో చెత్త చెదారాలు, గుర్రపు డెక్క, జమ్మి తదితర వ్యర్థాలను తొలగించి మురుగు నీరు దిగువకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు....

గ్రామంలోని ప్రధాన డ్రెయిన్ చెత్త చెదారం గుర్రపు డెక్కలతో నిండిపోయి మురుగు పేరుకుపోయినా అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికై నాఅధికారులు స్పందించి డ్రెయిన్‌లో పేరుకు పోయిన మురుగు, డెక్క, నాచు తొలగించాలని కోరుకుంటున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం

డ్రెయినేజీలో మురుగు దిగువకు ప్రవహించక పోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయిన్‌లో మురుగునీటిలో గుర్రపుడెక్క, తూటికాడ తదితరాల వల్ల ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్ల వద్దే ఉంటోంది. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లోని మురుగునీరు దిగువకు ప్రవహించేలా చర్యలు చేపట్టాలి.

–అరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పామర్రు

అడ్డంకులు తొలగించాలి

డ్రెయిన్‌లో మురుగు పేరుకుపోయి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరంగా ఉంది. స్థానిక వార్డులలోని మురుగునీరు, వర్షపు నీరు దిగువకు పోవాలంటే డ్రెయిన్‌లోని అడ్డంకులను సత్వరమే తొలగించాలి. అధికారులు స్పందించి మురుగు దిగువకు పోయేలా చర్యలు తీసుకోవాలి.

–కె.సాల్మన్ రాజు, పామర్రు

సర్వసభ్య సమావేశం బహిష్కరణ



సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ

ముదినేపల్లి రూరల్: 'ప్రోటోకాల్ పాటించరు.. మండలంలో ఏ కార్యక్రమాలు జరుగుతున్నాయో స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియడం లేదు. మండల సర్వసభ్య సమావేశాలకు ముఖ్యమైన శాఖల అధికారులు హాజరుకావడం లేదు. ఇలాంటి అధికారులకు నోటీసులు ఇచ్చి హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవోకు సూచించినా పట్టించుకోవడం లేదు. ఇలాంటప్పుడు మండల సర్వసభ్యసమావేశాలెందుకు? అధికారుల తీరు ఇలా ఉంటే మండలంలోని ప్రజలకు పనులు ఏవిధంగా చేయగలుగుతాం? ప్రయోజనం లేని ఇలాంటి సమావేశాలు పాల్గొనడం కంటే బహిష్కరించడమే మేలు' అంటూ ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీల సభ్యులు అధికారుల తీరును విమర్శిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఎంపీపీ అధికారుల తీరును తీవ్రంగా ఎండగట్టారు. మండల సమావేశాలకు అధికారులు హాజరుకాకుంటే సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. మండలంలో ఎంపీ పాల్గొనే సమావేశానికి తమను పిలవకుండా ప్రోటోకాల్‌ను పాటించకపోవడంలోని ఆంతర్యం ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.పలు ప్రాథమిక పాఠశాలలను, యూపీ స్కూళ్లను హైస్కూళ్లల్లో విలీనం చేసే సమయంలో తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు అంటూ అధికారులను నిలదీశారు. స్థానిక ప్రజాప్రతినిధులంటే ఎందుకంత చులకన భావన అని ప్రశ్నించారు.

తరగతులు తరలించవద్దని తల్లిదండ్రుల ఆందోళన



ఎంపీడీఓ విజయసారథికి తమ సమస్యను విన్నవించుకుంటున్న తల్లిదండ్రులు

గుడ్లవల్లేరు:నూతన విద్యా విధానంపై తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఎంపీడీఓ టి.విజయసారథి వద్ద బాధిత విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. కౌతవరం పెద దళితవాడ సోషల్ వెల్ఫేర్ స్కూల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులు వేరే స్కూలుకి తరలించారని తెలిపారు. అలా తరలించవద్దని తల్లిదండ్రులు విన్నవించారు. తమ పిల్లల తరగతులు తమ విద్యార్థులకే ఉంచాలంటూ కోరారు. ఈ విషయమై గత కొంతకాలంగా పోరాటం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. ఆ పోరాటంలో భాగంగానే కౌతవరం నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ గుడ్లవల్లేరు ఎంఈఓ కార్యాలయంలో విన్నవించుకోవడం జరిగింది. ఇప్పటికైనా తమ పిల్లల చదువుల్ని కాపాడకపోతే అటకెక్కుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రసన్న కుమారి, అరుణ కుమారి, భార్గవి, పద్మశ్రీ, దుర్గాభవాని, నాగిని, రత్నకుమారి, కృపాంజలి, కొండ, ప్రతాప్, రాజశేఖర్, లలిత, వీరబాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు డీఎన్నార్ సాయం



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డీఎన్నార్

మండవల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి కుటుంబ సభ్యులను శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 8న కైకలూరుకు చెందిన ఫొండ్రి బ్రహ్మం కుటుంబ సభ్యులు కొమ్మోజు సతీష్, సుందర్ ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళుతున్నారు. ఏలూరు నుంచి కైకలూరు వస్తున్న కారు కొవ్వాడలంక వద్ద వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావాడంతో విజయవాడ హెల్ప్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల కుటుంబ సభ్యులను డీఎన్నార్ పరామర్శించారు. ఆయన వెంట కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము, పంజా రామారావు ఉన్నారు.

వైభవంగా కొండలమ్మకు లక్ష మల్లెల పూజ



కొండలమ్మకు మల్లెలార్చన చేస్తున్న వేద పండితులు

శ్రీకొండలమ్మ అమ్మవారికి లక్ష మల్లెల పూజను శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పంతో పాటు తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. సామూహిక పూజల్లో దంపతులు విరివిగా పాల్గొన్నారు.

–గుడ్లవల్లేరు



సామూహిక పూజలు చేస్తున్న దంపతులు



లక్ష మల్లెల అర్చనతో కొండలమ్మ మూల విరాట్

వృద్ధులను వేధిస్తే చర్యలు తప్పవు



వృద్ధుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న న్యాయమూర్తి జి. సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: వృద్ధాప్యంలో ఉన్నవారి పట్ల కుటుంబ సభ్యులు, సమాజం దురుసుగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా చర్యలు తప్పవని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 15వ తేదీ ప్రపంచ వృద్ధుల వేధింపు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని మమత ఆశ్రమంలో వృద్ధులను పరామర్శించారు. వారి స్థితిగతులను, కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, ఇతర అంశాలు ఏమైనా ఉంటే కమిటీ దృష్టికి తెస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. న్యాయవాదులు, పారా లీగల్ సెల్ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటూరు రైల్వేగేటు మూసివేత

గుడివాడ టౌన్: రూరల్ మండలం పరిధిలోని మోటూరు రైల్వేగేటు 15 రోజులు మూసివేస్తున్నట్లు రైల్వే పీడబ్ల్యూఐ రెహ్మాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గేటు మూసివేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించి ఇతర మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

● పచ్చటి తివాచీలా...



తోట్లవల్లూరు మండలంలో వరి నారుమడుల సాగు పనులు రైతులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో విద్యుత్ బోర్ల ద్వారా నీటి అవకాశం ఉన్న రైతులు గత వారం రోజులుగా నారుమడుల సాగుపై దృష్టి సారించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వల్లూరుపాలెంలో మొలకెత్తిన నారుమడులు పచ్చటి తివాచీలా దర్శనమిస్తూ కనువిందు చేస్తున్న చిత్రమిది. –తోట్లవల్లూరు

భారీ వర్షంతో జలమయం



తక్కెపాడులో నీటిలో తేలియాడుతున్న రహదారి



మండలంలో నీట మునిగిన వరి విత్తనాలు వెదజల్లిన పొలం

మండవల్లి: మండలంలో నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాలు నీటిలో తేలియాడుతున్నాయి. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, తక్కెళ్ళపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. 10.4 మి. మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, తహసీల్దార్ కార్యాలయం పక్కన, కైకలూరు వీధిలో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్కెళ్ళపాడులో రహదారులు జలమయం కావడంతో రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. మండవల్లి, ఏలూరు జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తక్కెళ్లపాడు గ్రామానికి 20 ఏళ్ల నుంచి రహదారి సౌకర్యం లేక జనం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారులు అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచి వివిధ పనులపై కార్యాయలకు వచ్చే లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణం కూడా వర్షం నీటితో నిండి ఉంటుంది. అనారోగ్యంతో పీహెచ్‌సీకి వెళ్లే వారికి దోమలు కుట్టి మరిన్ని ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది.

ముదినేపల్లిని ముంచెత్తిన భారీ వర్షం....

ముదినేపల్లి రూరల్ : మండలంలో శుక్రవారం భారీవర్షం కురిసింది. తెల్లవారు జామున కొద్దిసేపు భారీవర్షం కురిసి విరామం ఇచ్చినప్పటికీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అనేక గ్రామాల్లో రహదారులు పూర్తిగా వర్షపునీటితో నిండిపోయాయి. ముదినేపల్లి సెంటర్లో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందు వల్ల రహదారి గోతులమయంగా మారింది. దీంతో వర్షపు నీరంతా రహదారిపై నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు. సెంటర్ నుంచి సచివాలయానికి వెళ్లే రహదారి మొత్తం బురదమయంగా మారింది. ఈ ప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రెయినేజీ నిర్మించాల్సి ఉంది. దీనిపై సరైన శ్రద్ధ చూపకపోవడంతో భారీ వర్షం వస్తే సచివాలయానికి వెళ్లే ప్రజలు రహదారి వెంబడి ఉన్న దుకాణదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం వల్ల దుకాణాల్లోకి సైతం నీరు చేరుతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. ఏరువాక పౌర్ణమి రోజు బుధవారం భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అదేరోజున కొన్ని గ్రామాల్లోని పొలాల్లో దమ్ముదుక్కులు చేసి నేరుగా వరి విత్తనాలు చల్లారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే విత్తనాలు కుళ్లిపోయే ప్రమాదముందని వాపోతున్నారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా లతీఫ్ బాషా

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల తహసీల్దార్‌గా ఎస్‌కె లతీఫ్‌బాషా నియమితులయ్యారు. మచిలీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న బాషా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బాషాను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఎలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ రూరల్ మండలం, గుడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో లైన్లు మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకి సబ్ స్టేషన్ పరిధిలో గల చినముత్తేవి, కారకంపాడు, అయ్యంకి, కూచిపూడి, పెదపూడి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు గ్రామాల్లో శనివారం మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కైకలూరు: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం కైకలూరు పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ పథకం దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

తోట్లవల్లూరు:పేద దళితులకు ఉద్దేశించిన జగజ్జీవన్‌జ్యోతి ఉచిత విద్యుత్ పథకం దుర్వినియోగంపై మండలంలోని దేవరపల్లిలో ట్రబ్లెస్ స్క్వాడ్ విజిలెన్స్ విజయవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. గంగాభవాని నేతృత్వంలో ఏపీటీఎస్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. జగజ్జీవన్‌జ్యోతి విద్యుత్ పథకానికి సంబంధించిన సర్వీసులు దుర్వినియోగం అవుతున్నట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ గత ఏడాది డిసెంబర్ 31న అప్పటి రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి జి. విజయానంద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించటంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. దేవరపల్లిలో జగజ్జీవన్‌జ్యోతి పథకం ద్వారా దుర్వినియోగమవుతున్న విద్యుత్ సర్వీసును తొలగించటంతోపాటు దీనికి కారకులైన వారిపై విచారణ జరుపుతున్నారు. ఎలక్ట్రికల్ విజిలెన్స్ అధికారి దాస్ ఈ విషయమై ఫిర్యాదుదారుడైన శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. పేదలకు అందాల్సిన ఉచిత విద్యుత్ కొందరి అధికారుల అవినీతి కారణంగా అన్యాక్రాంతం జరుగుతోందని ఆయన విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై రాష్ట్ర లోకాయుక్తకు సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలియజేశారు.

మండలంలో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

పెదపారుపూడి:మండలంలోని 19 గ్రామాల్లోని గృహాల్లో విద్యుత్ వాడకంపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ కిరణ్‌బాబు మాట్లాడుతూ మండలంలో 41 టీమ్‌లతో సుమారు 2887 గృహాల విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ చేశామని చెప్పారు. 313 ఇళ్లల్లో అనుమతి ఉన్న అధిక లోడ్ కంటే విద్యుత్ వాడకం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. సుమారు రూ.8 లక్షల జరిమానా విధించామని పేర్కొన్నారు. అధిక లోడు వాడుతున్న విద్యుత్ వినియోగదారులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. అక్రమ విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ ఈఈ జీబి శ్రీనివాసరావు, మండల విద్యుత్ ఏఈ వరకుమార్ పాల్గొన్నారు.

ఇసుక క్వారీలలో తవ్వకాల నిలుపుదల



నార్త్తువల్లూరు క్వారీకి వెళ్లే రోడ్డుకు అడ్డుగా వేసిన రబ్బీష్ గుట్టలు

తోట్లవల్లూరు:ఇసుక క్వారీలలో తవ్వకాలను నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ ఎం. కుసుమకుమారి శుక్రవారం తెలిపారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు అక్టోబర్ 15 వరకు నార్తువల్లూరు, రొయ్యూరుతోపాటు ఎక్కడా ఇసుక తవ్వకాలు జరపటానికి వీల్లేదన్నారు. ఆయా క్వారీలకు వెళ్లే రహదారులకు రబ్బిష్ గుట్టలు అడ్డంగా వేయటం, గండ్లు కొట్టడం చేయటం జరిగిందన్నారు. ఇసుక తవ్వకాల నిషేధంపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నార్తువల్లూరు, రొయ్యూరు ఇసుక క్వారీలను మైనింగ్ అధికారులు సందర్శించి పరిశీలించినట్లు తెలిసింది.

ఎంపీడీవో, ఏవో బదిలీ

మొవ్వ:ఎంపీడీవో జె.విమాదేవి, వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ బదిలీ అయ్యారు. పెదపారుపూడి ఎంపీడీవోగా విమాదేవి బదిలీ అయ్యారు. ఈమె గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అక్టోబర్ 4న ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అలాగే ఏవో కె.శివ ప్రసాద్ గన్నవరం మండలానికి బదిలీ అయ్యారు. 2017 జూన్‌లో ఈయన ఏవోగా బాధ్యతలు చేపట్టారు.